# నమస్తే తెలంగాణ
## జోగులాంబ గద్వాల వనపర్తి
3 | మహబూబ్‌నగర్, శనివారం 5 అక్టోబర్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY





# కందనూలు ఖాకీలపై అవినీతి మచ్చ!

- ఇసుక అక్రమ దందాలో హస్తం?
- సెటిల్‌మెంట్లు, బ్లాక్‌మెయిలింగ్‌లోనూ..
- అంతర్గతంగా విచారణ చేసిన పోలీస్ ఉన్నతాధికారులు
- సంబంధమున్న నలుగురు ఎస్సైలు వీఆర్‌కి అటాచ్
- కొందరి తీరుతో పోలీసులకు చెడ్డపేరు

## అక్రమ వ్యాపారులతో కొందరు పోలీసుల చెట్టాపట్టాలు?

కందనూలులో కొందరు ఖాకీల తీరు పోలీసు శాఖకు మచ్చ తెస్తోంది. ఇసుక, సెటిల్‌మెంట్లు, బ్లాక్‌మెయిలింగ్‌లకు పాల్పడుతూ 'కంచె చేను మేసినట్లు'.. అవినీతిలో కూరుకుపోతున్నారు. దీంతో తరచూ వివాదాస్పదమవుతూ వస్తున్న ఆ శాఖకు సొంత ఉన్నతాధికారులే షాక్ ఇవ్వడం గమనార్హం. ఇసుక అక్రమ వ్యాపారాలకు సహకరిస్తున్నారనే కారణంతో జిల్లాలోని నలుగురు ఎస్సైలను వీఆర్‌కు పంపుతూ మల్టీ జోన్-2 డీఐజీ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది. దీంతో ఫ్రెండ్లీ పోలీసుల స్థానంలో ప్రభుత్వం మారిన తర్వాత అవినీతి పోలీసింగ్‌గా మారిందన్న అపప్రద ఆ శాఖ మూటగట్టుకుంటోంది.

– నాగర్‌కర్నూల్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ)


నాగర్‌కర్నూల్ జిల్లాలో పోలీసుల తీరు రాష్ట్రంలో పరువు తీస్తోంది. చిన్న చిన్న గొడవల్లో అతిగా ప్రవర్తించడంతో పాటుగా పలు దందాల్లోనూ మధ్యవర్తులుగా ఉండటం, సివిల్ తగాదాల్లో తలదూర్చుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఇసుక దందాలో తలదూర్చుతున్నారనే ఆరోపణలు సాధారణంగా పోలీస్ శాఖపై ఎప్పటి నుంచో ఉంటున్నదే. ఈ క్రమంలో జిల్లాలోని దుందుభీ పరివాహక ప్రాంతాల్లోని వంగూరు, చారకొండ, ఉప్పునుంతల, తాడూరు, తెలకపల్లి, తదితర ప్రాంతాల్లో అక్రమ ఇసుక వ్యాపారాలకు పోలీసులే సహకరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు అక్రమ వ్యాపారులకు ఈ మండలాల్లోని పోలీసులు సహకరిస్తూ చేతులు తడుపుకొంటున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఈ క్రమంలో జిల్లా పోలీసు అధికారులు మాత్రం ఎక్కడా ఇలాంటి చర్యలు జరగడం లేదనే రీతిలో చెప్పుకుంటూ వస్తున్నారు.

### ఉన్నతాధికారుల చర్యలు

పలువురు పోలీసులు అక్రమ దందా చేస్తున్న వారితో చేయి కలిపినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పోలీస్ ఉన్నతాధికారులు అంతర్గత విచారణ చేపట్టగా.. ఈ తతంగమంతా నిజమని తేలింది. ఇటీవలే మల్టీజోన్-2 డీఐజీ సత్యనారాయణ రాష్ట్రంలో అవినీతికి పాల్పడుతున్న పోలీసులపై శాఖాపరమైన చర్యలకు ఆదేశించారు. ఇందులో కందనూలు జిల్లాలోని బిజినేపల్లి, తెలకపల్లి, వంగూరు, ఉప్పునుంతల ఎస్సైలను వీఆర్‌కు పంపించడం గమనార్హం. మరో ఎస్సైని ఇప్పటికే బదిలీ చేశారు. ఇలా పోలీసు శాఖ ఉన్నతాధికారుల విచారణలో 20 మండలాల్లోని ఐదు మంది ఎస్సైలు అక్రమ ఇసుక వ్యాపారానికి సహకరిస్తున్నట్లు తేలడం సంచలనంగా మారింది. ప్రతిరోజూ టిప్పర్లు, ట్రాక్టర్లతో రోడ్ల మీదుగా ఇసుక తరలుతూనే ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో జరగడం లేదు.. కానీ అభివృద్ధి పనులు, ఇండ్ల పేర్లతో చెప్పి ఇసుక వ్యాపారులు అక్రమ దందాకు తెరలేపారు. దీన్ని అరికట్టాల్సిన రెవెన్యూ శాఖ సొంత పనుల్లో మునిగి ఉంటే.. పోలీసు శాఖ తమదే బాధ్యతన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలోని ఐదుగురు ఎస్సైలపై ఇలా అక్రమ ఇసుక వ్యాపారానికి సహకరిస్తున్నారని స్పష్టం కావడంతో ఇప్పటి వరకూ వస్తున్న ఊహాగానాలు నిజమని నమ్మే పరిస్థితులు ఏర్పడ్డాయి. అలా గే పలు సంఘటనల్లో కోడి పందేలు, మట్టి తవ్వకాలు, పేకాటకు సహకరించడం, కొందరిని తప్పించడం వంటి సంఘనటలకు పాల్పడుతున్న కొందరు ఖాకీలతో ఉన్నతమైన ఆ శాఖ పరువు బజారున పడుతుందని చర్చ నడుస్తున్నది. ఈ క్రమంలో ఓ కేసులో వెల్దండ ఎస్సై ఏసీబీకి పట్టుబడగా, బ్లూకోర్ట్ కానిస్టేబుళ్లు ఫొటోలు తీసి బ్లాక్‌మెయిల్ చేసిన సంఘటనతో బాధితులు ఆత్మహత్యాయత్నం చేయగా.. ఒకరిని సస్పెండ్ చేశారు. కోడేరులో పట్టుకున్న మట్టి ట్రాక్టర్‌ను వదిలివేసిన ఘటన చోటు చేసుకున్నది.

### తీవ్ర ఆరోపణలు చేసిన మర్రి

ఇసుక అక్రమ వ్యాపారంపై నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి గతంలో మీడియాతో మాట్లాడుతూ తీవ్ర ఆరోపణలు చేశారు. చా లా వరకు బయటకు రాని సంఘటనలు ఎన్నో ఉన్నాయి. జిల్లా పోలీస్ బాస్ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ పోలీసు శాఖ ప్రతిష్టను కాపాడేలా, నిజాయితీగా ఉంచేలా, అక్రమాల్లో భాగం కాకుండేలా ఓవైపు చర్యలు తీసుకుంటుంటే.. మరోవైపు కొందరు పోలీసులు తమకేం పట్టనట్లుగా అక్రమాలో తలదూరుస్తుండటం విశేషం. మొత్తమీద కందనూలు పోలీసు శాఖలో ఒకేసారి నలుగురు ఎస్సైలను అక్రమ ఇసుక వ్యాపారంలో వీఆర్‌కి పంపించడం చర్చనీయాంశంగా మారింది. పోలీసులు అవినీతి దందాపై ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. అందుబాటులోకి రాలేదు.



ఖిల్లాఘణపురం : మల్కిమియాన్‌పల్లి శివారులో చిరుత అడుగు జాడ

### కానిస్టేబుల్‌పై వేటు

గద్వాల అర్బన్, అక్టోబర్ 4 : రేషన్ బియ్యం అక్రమ రవాణాకు సహకరించిన కానిస్టేబుల్ కృష్ణయ్యను సస్పెన్షన్ చేస్తూ ఎస్పీ శ్రీనివాసరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీ కథనం మేరకు అయిజ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న కృష్ణయ్య రేషన్ బియ్యం అక్రమ రవాణాకు సహకరిస్తున్నారన్న సమాచారం మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు. అక్రమాలకు పాల్పడినట్లు నిజనిర్ధారణ కావడంతో శాఖాపరమైన క్రమ శిక్షణ చర్యల్లో భాగంగా సస్పెన్షన్ చేసినట్లు తెలిపారు. పోలీస్ శాఖలో పనిచేస్తూ చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడిన వారిని ఉపేక్షించేది లేదని ఎస్పీ హెచ్చరించారు.

# వామ్మో పులి

- భయాందోళనల్లో గ్రామస్తులు

ఖిల్లాఘణపురం, అక్టోబర్ 4: మండలంలోని కొన్ని గ్రామాల్లో కొన్ని నెలలుగా చిరుత సంచరిస్తున్నది. మండలంలోని మల్కిమియాన్‌పల్లి గ్రామ శివారులో చిరుత అడుగు జాడలు కపినించడంతో గ్రామస్తులు వామ్మో పులి అని భయాందోళనకు గురవుతున్నారు. ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న అధికారులు అడుగు జాడలు గుర్తించి చిరుత సంచరిస్తుందని గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా జాగ్రత్తలు ఉండాలని ఆదేశించారు. ఫారెస్ట్ అధికారులు వెంటనే చిరుతను బంధించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### చిరుత దాడిలో జింక మృతి

ధన్వాడ, అక్టోబర్ 4 : చిరుత దాడిలో జింక మృతిచెందిన ఘటన ధన్వాడ మండలంలోని మందిపల్లి గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకున్నది. రైతుల కథనం మేరకు గ్రామంలో చిరుత సంచరిస్తూ వారం రోజుల వ్యవధిలో కొడే, గొర్రెలపై దాడి చేసినట్లు ఆవేదన వ్యక్తం చేశా రు. ఈ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్న విషయం అటవీశాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతు లు వాపోయారు. మందిపల్లిలో బోన్ ను ఏర్పాటు చేసి చిరుత నుంచి కాపాడాలని రైతులు కోరుతున్నారు.



చిరుత దాడిలో మృతిచెందిన జింక

# థర్మల్ ప్లాంట్‌ను జెన్‌కోతో నిర్మించాలి



ఆందోళన చేస్తున్న తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, అక్టోబర్ 4: రామగుండం థర్మల్ ప్లాంట్‌ను టీజీ జెన్‌కో ద్వారానే నిర్మించాలని తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని విద్యుత్ భవన్ ఎదుట భోజన విరామ సమయంలో ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. జెన్‌కోకు చెందిన ఈ పవర్‌ప్లాంట్‌ను మూసివేసి, 580 ఎకరాల స్థలాన్ని సింగరేణికి అప్పగించి, ఆ సంస్థతో విద్యుదుత్పత్తి కేంద్రాన్ని నిర్మించాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని జేఏసీ నేతలు కోరారు. కొత్తగా నిర్మించే థర్మల్, జల, సోలార్ విద్యుత్ ప్రాజెక్టులను జెన్‌కో ద్వారానే నిర్మించాలన్నారు. కార్యక్రమంలో నవీన్, చంద్రశేఖర్, వెంకట్‌నారాయణ, సోమశేఖర్, స్వామి, బాబ్య, వెంకట్రాముడు, బల్‌రాంనాయక్, రామరాజు, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

- నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి
- రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలను ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

ధన్వాడ, అక్టోబర్ 4 : క్రీడాకారులు క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి సూచించారు. మండలకేంద్రంలో రెండురోజుల పాటు నిర్వహించే రాష్ట్ర స్థాయి అండర్ 14,17 రెజ్లింగ్ పోటీలను శుక్రవారం ఎమ్మెల్యే జూనియర్ కళాశాల మైదానంలో ప్రారంభించారు. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాల నుంచి 300మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అలాగే పేట వారం రోజుల పాటు నిర్వహించే వన్య ప్రాణి సంరక్షణ వారోత్సవాలను ఎమ్మెల్యే మండల కేంద్రంలో ప్రారంభించారు. అనంతరం గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతోనే రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలను మండల కేంద్రంలో నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నారాయణ పేట మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి, వైస్ చైర్మన్ హన్మంతు, డీవైఎస్‌వో వెంకటేశ్, రెజ్లింగ్ జిల్లా కార్యదర్శి నర్సింహులు, బాల్‌రాజ్, ఎంపీడీవో సాయి ప్రకాశ్, నాయకులు ఉదయభాను, నరహరి, సూర్యమోహన్ రెడ్డి, సాయినాథ్, నర్సింహాచారి, రాజశేఖర్, శ్రీనివాసులు, శివకుమార్ పాల్గొన్నారు.

# పూల సింగిడి

- తీరొక్క పూలతో పీయూలో సందడి
- పాలమూరులో ఘనంగా బతుకమ్మ వేడుకలు
- ఆడిపాడిన ఆచార్యులు, అధ్యాపకులు, విద్యార్థినులు



బతుకమ్మతో వస్తున్న విద్యార్థిని

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 4 : శుక్రవారం నాడు ఉయ్యాలో చన్నీటి జలకాలు ఉయ్యాలో..! చన్నీటి జలకాలు ఉయ్యాలో ముత్యమంత పసుపు ఉయ్యాలో..! అంటూ విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా పీయూలో మన బతుకమ్మ వేడుకలను నిర్వహించుకున్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో బతుకమ్మలను తలపై ఎత్తుకొని బొడ్డెమ్మలు వేస్తూ పూల సింగిడిని అంబరాన్నంటేలా నిర్వహించుకున్నారు. బతుకమ్మ వేడుకలతో పాలమూరు విశ్వవిద్యాలయం పులకించిపోయింది. అన్ని విభాగాల్లో పూల పండుగ పరిమళాలు వెదజల్లుతున్నాయి. ప్రతి విభాగం ఓ పూలవనమైంది. తెలంగాణ సంస్కృతి వైభవాన్ని, వారసత్వాన్ని చాటే బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి.



పాలమూరు విశ్వవిద్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, అధ్యాపకులు

### సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలచేది బతుకమ్మ పండుగ అని పీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. పీయూ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం పీయూలో నిర్వహించిన బతుకమ్మ సంబురాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ఆడపడుచులంతా సంబురంగా నిర్వహించుకునే వేడుక అన్నారు. బంధాలను, అనుబంధాలను గుర్తుచేస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ, తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పే పండుగ బతుకమ్మ పండుగ అన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడారు. కార్యక్రమాల్లో ఎన్‌ఎస్‌ఎస్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ప్రవీణ, ప్రిన్సిపాళ్లు నూర్జహాన్, చంద్రకిరణ్, బషీర్ అహ్మద్, పీయూ పీఆర్వో శేకుంటి రవికుమార్, వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



బతుకమ్మకు పూజలు చేస్తున్న ఇన్‌చార్జి రిజిస్ట్రార్

# నక్సలైట్ పేరుతో బెదిరింపులు

- రైస్‌మిల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడికి ఫోన్ చేసి రూ.50లక్షలు డిమాండ్
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : కష్టపడకుండా డబ్బులు సంపాదించాలనే దురాశతో నక్సలైట్‌నని బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ , డీఎస్పీ వెంకటేశ్వర రావుతో కలిసి శుక్రవారం వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మామిరెడ్డిపల్లికి చెందిన తిప్పిరెడ్డి సుదర్శన్‌రెడ్డి అలియాస్ ప్రమోద్‌రెడ్డి మావోయిస్టు అవతారమెత్తాడు. వనపర్తి జిల్లాలోని రైస్‌మిల్ అసోయేషన్ జిల్లా అధ్యక్షుడు ఖిల్లాఘణపురం మండలం సోలీపూర్‌కు చెందిన శేఖర్‌రెడ్డికి ఫోన్ చేసి రూ.50లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. డబ్బులు ఇవ్వకుంటే చంపుతానని బెదిరించాడు. అక్టోబర్ 2వ తేదీన బెదిరించి ఖాతాలోకి రూ.8 వేలు వేయించుకున్నాడు. మళ్లీ డబ్బులు కావాలని డిమాండ్ చేయడంతో శేఖర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై నిఘా పెట్టిన పోలీసులు ఖిల్లాఘణపురం బస్టాండ్ సమీపంలో సుదర్శన్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి మొబైల్ ఫోన్, రూ.6 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇతడిపై ఇప్పటికే నేరచరిత్ర ఉన్నదని, 12 కేసులు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌లోని హబ్సీగూడ అపార్ట్‌మెంట్‌లో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. ఆత్మరక్షణ పేరుతో గన్ లైసెన్స్ తీసుకొని రివాల్వర్ కొని దానిని చూపించి చిన్న చిన్న సెటిల్‌మెంట్లు చేసేవాడు. ఆ వచ్చిన డబ్బులను రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడి పెట్టగా నష్టాలు రావడంతో ఇలా తప్పుడు పనులకు తెరలేపాడు. పెద్దపల్లి జిల్లాలోని ఓ రైస్‌మిల్ యజమాని బెదిరించి డబ్బులు వసూలు చేశాడు. అలాగే కరీంనగర్, సుబేదారి, మిర్యాలగూడ, సుల్తానాబాద్ తదితర ప్రాంతాల్లో డబ్బుల వసూళ్ల కేసుల్లో జైలు పాలయ్యాడని ఎస్పీ వెల్లడించారు. కాగా, ఈ కేసును ఛేదించిన కొత్తకోట సీఐ రాంబాబు, ఎస్సై సురేశ్, కానిస్టేబుల్స్ లింగం, రాజులను ఎస్పీ అభినందించారు.




కేసు వివరాలు వెల్లడిస్తున్న వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ చిత్రంలో నిందితుడు

### అప్రమత్తంగా ఉండాలి ఎస్పీ రావుల గిరిధర్

సెలవుల్లో ఊళ్లకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రావుల గిరిధర్ ఇండ్ల యజమానులకు సూచించారు. ఇండ్లకు తాళాలు వేసి ఇంట్లో బంగారం, నగదు ఉంచి గ్రామాలకు వెళ్లడం సరియైనది కాదన్నారు. ఇండ్లలో ఎవరూ లేనప్పుడు కనీస జాగ్రత్తలు పాటించాలని, పక్కింటి వారికి సమాచారం ఇవ్వాలని, బైక్, కార్లు ఆవరణలోనే పార్కింగ్ చేయాలని, వాహనాల్లో విలువైన వస్తువులను ఉంచకూడదన్నారు. నగలు, నగదును బ్యాంకుల్లో ఉంచాలని లేకపోతే మీ వెంట తీసుకువెళ్లాలన్నారు. ఎవరైనా అనుమానంగా కనిపిస్తే వెంటనే 100కు డయల్ చేయాలని, ప్రజలు పోలీసులకు సహకరించడంతో చోరీలను నియంత్రించవచ్చని ఎస్పీ పేర్కొన్నారు.

### మాజీ జవాన్‌కు దేహశుద్ధి

బిజినేపల్లి, అక్టోబర్ 4: పాలెం గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ మాజీ ప్రజాప్రతినిధి భార్యపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు వైరల్ చేయగా మహిళలు, యువకులు పెద్దఎత్తున మాజీ ఆర్మీ జవాన్ ఇంటి ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. అనంతరం మాటా మాట పెరిగి తోపులాట జరిగింది. ఈక్రమంలోనే కొందరు మహిళలు, యువకులు, గ్రామస్తులు మాజీ సైనికుడిపై దాడిచేశారు. అనంతరం మాజీ ప్రజాప్రతినిధి వర్గీయులు కూడా జవాన్ భార్య గూర్చి అసభ్యకర పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ చేశారు. అయితే మాజీ ప్రజాప్రతినిధి వర్గీయులు మాజీ సైనికుడి కుటుంబానికి క్షమాణలు చెప్పినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై స్థానిక పోలీసులకు వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.




సాయం కాలానా.. సంధ్యా సమయానా.. కృష్ణా తీరం మహాద్భుతంగా కనిపించింది. నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం మంచాలకట్ట వద్ద కడలిని తలపిస్తున్న నదీ జలాల మీదుగా.. మేఘాల మధ్య నుంచి మెల్లగా జారుకుంటున్న సూర్యుడిని చూడడానికి సందర్శకుల రెండు కండ్లు చాలలేదు. ఈ దృశ్యాన్ని నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్ క్లిక్ మనిపించాడు.

– నాగర్‌కర్నూల్ ఫొటోగ్రాఫర్, అక్టోబర్ 4

### బ్రహ్మచారిణీగా శ్రీశైల భ్రామరి




శ్రీశైలంలో దసరా మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం అమ్మవారిని సింహమండపం వద్ద ఏర్పాటు చేసిన వేదికపై బ్రహ్మచారిణీగా అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అక్క మహాదేవి అలంకార మండపంలో భ్రామరి, మల్లికార్జునులు మయూర వాహనాన్ని అధిష్టించి భక్తులను కరుణించారు. అనంతరం గ్రామోత్సవంలో భాగంగా ఉత్సవమూర్తులు మయూర వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో ఈవో పెద్దిరాజు, పీఆర్‌వో శ్రీనివాసరావు, ఈఈ నర్సింహారెడ్డి, అనీల్‌కుమార్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ అయ్యన్న ఉన్నారు. – శ్రీశైలం, అక్టోబర్ 4



### భక్తకోటి స్వరూపిణి

- గద్వాలలో రూ.3.51 కోట్లతో అమ్మవారికి అలంకరణ

జిల్లా కేంద్రంలోని రాజవీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని రూ. 3.51కోట్లలతో శుక్రవారం అలంకరణ చేశారు. అలాగే రెండో రైల్వేగేట్‌లోని తాయమ్మ ఆలయంలో అమ్మవారిని రూ. 51లక్షలతో అలంకరించారు. అంబాభవాని, కాళమ్మ ఆలయాల్లో అమ్మవారిని ధనలక్ష్మి రూపంలో అలంకరించి విశిష్ట పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి సన్నిధిలో పెద్దఎత్తున మహిళలు పాల్గొని కుంకుమార్చన చేసి భక్తితో కొలిచారు. – గద్వాలటౌన్, అక్టోబర్ 4



### కరుణించిన జోగుళాంబ

అలంపూర్ క్షేత్రంలో దేవీ శరన్నవ రాత్రోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం జోగుళాంబ బ్రహ్మచారిణి దేవీగా భక్తులకు దర్శనమిచ్చింది. ఒక చేతిలో కమండలం, మరో చేతిలో పుస్తకం, జపమాల, దండం ధరించి కటాక్షించారు. పూజా కార్యక్రమాల్లో ఈవో పురేందర్‌కుమార్, ఆలయ ధర్మకర్తలు, పాలక మండలి చైర్మన్ కొంకల నాగేశ్వర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు. – అలంపూర్, అక్టోబర్ 4